# చిన్న చిన్న ప్రేక్షకులున్నారు, జాగ్రత్త

–"వాసంతి"

గాయత్రి ఆటో దిగి గేటు మీద చెయ్యి వెయ్యబోయింది. గేటు దానంతటదే విసురుగా తెరుచుకోవటంతో ఆశ్చర్యంగా తలెత్తి చూసింది. పక్కింటి మహాలక్ష్మమ్మ కళ్ళు ముక్కు కొంగుతో తుడుచుకుంటూ గాయత్రిని దాటుకుని తనింట్లోకి వెళ్ళిపోయింది. వెనకే ఆవిడ మనుమరాలు రేఖ పరుగెత్తింది.

పదిమందిని ఒకేసారి ఏడిపించగల మహాలక్ష్మమ్మ ఏడుస్తూ తన ఇంట్లో నుండి వెళ్ళటం చూసి హడలిపోయి లోపలకు వెళ్ళి పిల్లల్ని పిలిచింది గాయత్రి. "ఏమట్మా, మహాలక్ష్మమ్మ మామ్మ ఏడుస్తూ వెడుతోందేమిటి?"

రాస్తున్న రికార్డు వదిలి వచ్చింది విజయ. "మహాలక్ష్మమ్మ మామ్మే ఏడుస్తూంట? నువ్వు ఏం చూసావో, కళ్ళజోడు మార్చుకోవాలేమో చూసుకో."

"ఈరోజు ఆవిడ చేత తిట్లు తినేందుకు ఎవరూ దొరకలేదేమో, నిద్రపట్టదని బెంగపడుతూ ఉండి ఉండాలి." రాజు తన అభిప్రాయం చెప్పేసి హెడ్‌ఫోన్స్ సర్దుకొని సంగీత ప్రపంచంలోకి వెళ్ళిపోయాడు.

చిట్టి నవ్వు ఆపుకోలేకపోయింది. "మామ్మా టీవి సీరియల్ చూస్తోందమ్మా"

"అంత ఏడుపు వచ్చే ఆ సీరియల్ ఏమిటే" అన్నీ కష్టాలేనా హీరోయిన్‌కి?

"మరే మామ్మకు కూడా ఏడుపు వచ్చేటంత" రాజు అడ్డొచ్చాడు.

"అదేంకాదు హీరోయిన్‌ని చంపటానికి దాని భర్తా, అత్తా ప్లానేశారు కాని అది ఫెయిలవుతుంది. హీరోయిన్ చచ్చిపోకుండా అత్తను, భర్తనీ పోలీసులకు పట్టించింది. వాళ్ళ కోసం ఏడుస్తోంది మామ్మ."

"ఆవిడ మనింట్లో టీవీ చూడటం ఎందుకు? వాళ్ళ టీవి ఏమయింది?"

"పెద్ద టీవి రంగారావు మామయ్య గదిలో ఉంటుంది. అక్కడికెవర్ని వెళ్ళనీయడు. చిన్న టీవి కోసం సుందరత్తా, భాస్కరం మామయ్య పోటీ. హిందీ, ఇంగ్లీషు చూస్తారు. తెలుగు పెట్టనే పెట్టరు. మన మామ్మకు జబ్బు చేశాక టీవి కొన్నావు కదా. అప్పటి నుండి ఆవిడ వచ్చి నువ్వు వచ్చేదాకా చూసి వెడుతుంది. అప్పుడే విశాలత్త ట్రాన్సఫరయి వెళ్ళింది కదా. రేఖ కూడా మనింటికే వస్తోంది. గబగబా హోంవర్కు చేసేసుకొని మేం కూడా చూస్తున్నాం."

"మామ్మ టీవి చూస్తోందన్న మాట. నయమే, కాస్త కాలక్షేపం"

"మామ్మ ఎక్కడ చూస్తోంది? తను ఏడింటికే మందు వేసుకొని నిద్రపోతుంది కదా. అంతదాకా మహాలక్ష్మమ్మ మామ్మ కబుర్లు చెపుతుంది. ఆ తరువాత అందరం టీవి చూస్తాం."

"మీ కార్టూన్లు ఆవిడకేం నచ్చుతాయే?"

"ఆవిడున్నంతసేపు కార్టూన్లు పెట్టొద్దంటుంది. అందుకని సీరియల్సే చూస్తాం."

"మొదట్లో ఆవిడ చెప్పుండేది, ఇప్పుడంతా బాగా తెలుస్తోంది"

ఎనిమిదేళ్ళ కూతురుకి టీవి సీరియల్ అర్థం కావటం, అవన్నీ రోజూ చూడటం గాయత్రికి ఆదుర్దా కలిగించింది. చదువు పాడవుతుందేమో చూసుకోవాలి అనుకుంటూ లోపలికి వచ్చింది. రెండు నెలల క్రితం వరకు హాయిగా ఉండేవారు. తను ఆఫీసు నుండి ఏ వేళకు వచ్చినా ఇబ్బంది లేకుండా పిల్లలను అత్తగారు చూచుకొనేది. మొదటి నుండి పిల్లల పెంపకం అంతా ఆవిడదే కనుక పిల్లలు ఆవిడంటే ప్రేమగా ఉంటారు. చిన్న క్లాసులో వాళ్ళు చదును కూడా ఆవిడే చూచుకొనేది. కొడుకు పోయిన లోటు పిల్లల్ని చూసుకొని మరచిపోయేందుకు తనూ ప్రయత్నిస్తూ కోడలికి ఆసరాగా ఉండేది. ఆవిడకు జబ్బు చేయటంతో భారం గాయత్రి మీద పడింది. అతి కష్టం మీద ఒక నెల ఇంట్లో ఉండకలిగింది. పైన సెలవు దొరకలేదు. సీనియర్‌వి, నిస్సియర్ ఆఫీసర్‌వి, ప్రమోషన్ లిస్టులో ఉన్నావు, మార్చిలో సెలవు కుదరదనటంతో సగం బాధ్యత పెద్ద పిల్లలకి పంచి గాయత్రి మళ్ళీ ఆఫీస్‌కు వెడుతోంది.

పనులు పూర్తిచేసుకొని మంచం మీద వాలింది గాయత్రి. చిట్టి సంగతి చూసుకోవాలి అనుకుంటూనే నిద్రలోకి జారిపోయింది.

మర్నాడు ఆదివారం భోజనాలయేక చీరలు, పిల్లల బట్టలు తెచ్చుకొని ఇస్త్రీ మొదలుపెట్టింది గాయత్రి.

"హోమ్‌వర్కు మొదలుపెట్టారా?" నవ్వుతూ వచ్చింది విశాలాక్షి.

"మీరెలా తప్పించుకొన్నారు మీ పద్మవ్యూహంలోంచి? మీ వాళ్ళు కొత్త కోరికలు ఏం కోరలేదా?"

పని ఆపెయ్యబోతున్న గాయత్రిని వద్దని సైగ చేస్తూ కుర్చీ లాక్కుని కూర్చుంది విశాలాక్షి. "మీరు కానివ్వండి. ప్రస్తుతం మా ఇంట్లో చాలా సీరియస్ విషయాలు మాట్లాడుకోబోతున్నారు. నన్ను దూరంగా ఉంచటానికి ఏ స్వీట్లో చెయ్యమంటారేమోనని భయమేసి ఇలా వచ్చేసాను."

"ఏమిటీ సంగతి?"

"ఎలాగయితేనేం మా మరిది ఒక గ్రీన్ కార్డుని పట్టబోతున్నాడు. ప్లాను ప్రకారం జరిగితే పెళ్ళి చేసుకొని అమెరికాకు కాపరానికెడతాడు."

"ఏం ప్లానేమిటి?"

"డాక్టరనిపించుకొని మూడేళ్ళుగా అమెరికా వెళ్ళాలని చేసిన ప్రయత్నాలు కలిసిరాలేదు కదా."

"ఈ పైనయినా ఎక్కడో ఉద్యోగం చూసుకొని స్థిరపడతాడనుకొన్నాం కదా."


"మనం అనుకున్నా, వాళ్ళు కాదు. ఈ మధ్య అమెరికాలో ఉన్న అమ్మాయిలకు, వెళ్ళబోయే భాగ్యశాలులకు గాలంవేసి ఆవిడ కొంగు పట్టుకొని అమెరికా వెళ్ళిపోదామని ప్రయత్నాలు చేశాడు కాని ఆ అమ్మాయిలు ఇంత కన్నా మంచి భర్తలను చూసుకొన్నారు."

"మరి ఇంకేం చేస్తాడుట?"

"అనుకోకుండా మంచి అవకాశం వచ్చింది. వాళ్ళ పెద్దక్క ఆడబిడ్డ మరిది అక్కడే ఉన్నాడు. అతని స్నేహితురాలు ఇండియన్ భర్త కోసం చూస్తోందిట."

"అమెరికాలోని వాళ్ళు పనికిరాకనే?"

"ఇంచుమించుగా వాళ్ళ అమ్మ, అమ్మమ్మా డైవోర్సీలట. ఈ అమ్మాయి ఒక్కతే కూతురు. బాగా డబ్బుందిట. తనూ డాక్టరే. భారతీయ కుటుంబాల్లో తల్లిదండ్రులతో పిల్లలు పెరిగే తీరు చూచి ఆ అమ్మాయికి కుతూహలం పెరిగింది. రెండేళ్ళపాటు చుట్టుప్రక్కల ఇండియన్ కుటుంబాలను పరిశీలించి స్థిరమైన కుటుంబాలు ఇండియన్స్‌తోటే కుదురుతాయని అభిపాయానికి వచ్చింది. ఇంకేముంది, ఆమె తన ఆలోచనను స్నేహితుడితో చెప్తే అతను



జాగ్రత్తగా వెదికి మా మరిదిని ఎన్నిక చేశాడు."

"భార్యను అన్యాయం చేసిన ఇండియన్ దొంగ వెధవ ఒక్కడూ ఆమె కళ్ళబడలేదా?"

"కళ్ళకు రంగుటద్దాలు వచ్చేకే వెతికి ఉంటుంది. ప్రస్తుతానికి భారతీయ భర్తలే ఆదర్శ పురుషులు. మా భాస్కరరావు రూపురేఖలు, డిగ్రీ నచ్చాయి. ఇక్కడి జీవితాన్ని గురించి బాగా తెలుసుకోవటానికి ఇక్కడకు వచ్చి మా ఇంట్లో ఒక నెల ఉండబోతోంది?"

"మీరు సెలవు పెట్టి ఇంట్లో ఉండాలా?"

"నేనెందుకు పానకంలో పుడకలాగా? అదీకాక ఆ డ్రామా అంతా చూచి పిచ్చెక్కి నేను ఇంట్లోంచి పారిపోతే నా పిల్లలు అనాథలవుతారు."

"మా అత్తగార్కి ఇంగ్లీషు రాదు. మా సుందరికి తెనుగే మాట్లాడటం సవ్యంగా రాదు. భాస్కరంకి మొహమాటం. ఇంకెలా నేర్చుకోబోతుంది మీ కేండిడేట్?"

"దానికో అద్భుతమైన ప్లాను ఆలోచించారు తల్లి పిల్లతూను. నేనంతా చాటునుంచి వినేసి ఇలా పారిపోయి వచ్చేశాను" విశాల నవ్వటం మొదలుపెట్టింది.

"పారిపోవడమేమిటి?"

"ఇంకా నవ్వు మింగితే పొట్ట పగిలిపోతుందని"

"అబ్బా సరిగ్గా చెప్పండి"

విశాలాక్షి బలవంతాన నవ్వు ఆపుకుంది. "మా ఆయన రెండేళ్ళ క్రితం ఎట్టకేలకు సంపాదన పరుడయ్యాడు. ప్రస్తుతం పది టీవీ సీరియల్స్‌కి రచయితా, ముఖ్య పాత్రధారీ."

"మీ ఆయన టీవిలో పనిచేస్తున్నట్లు మాకెవరికి తెలియదు" విశాల నవ్వింది, "అదే మంచిది"

"రెండేళ్ళ ముందు ఏం చేసేవాడు?"

"వాళ్ళమ్మకు పూజకి పూలు కోసిచ్చేవాడు, అప్పుడప్పుడు మొక్కలకు నీళ్ళు పోసేవాడు."

"ఇంట్లో ఉన్నప్పుడు కాదు విశాలా. వేళాకోళం ఆపు"

"నిజంగానే. అప్పుడప్పుడు శాంపిల్‌గా చేసి చూసి ఉద్యోగం తన వంటికి పడదని తెలుసుకుంటూ ఉండేవాడు. నా నగలు, నాన్న గారిచ్చిన డిపాజిట్లు సొమ్ము చేసేవాడు. ఇల్లు కూడా అమ్మి ఆ డబ్బు పూర్తిచేశాక ఆయన అదృష్టం తిరుగబడింది. ఎవడో టీవి.ప్రొడ్యూసర్ మా ఆయనలోని రచయితని గుర్తుపట్టి తన సీరియల్‌కి డైలాగ్స్ రాయటానికి పెట్టుకున్నాడు. అలా అలా బిజీ రైటర్ అయిపోయాడు. ఆయన సృష్టించిన కొన్ని అద్భుత పాత్రలకు ఎవరూ న్యాయం చేయలేరని ఆ బాధ్యత కూడా తీసుకొని నలుడు కూడా అయ్యాడు. ప్రస్తుతం ఇంట్లో వాళ్ళు లక్ష్మీదేవి దయతో మునిగి తేలుతున్నారు. ఈ విష వలయంలోకి పోకుండా నా పిల్లల్ని కాపాడుకొనేందుకు నేను నానా పాట్లు పడుతున్నా."

"అబ్బ ఈవిడ మనసు ఎంత లోతు" అనుకుంది గాయత్రి.

"ఇంతకు వాళ్ళ ప్లానేమిటి?"

"మా ఆయన రచనలన్నీ తెలుగుతనం ఉట్టిపడుతూ ఉంటాయిట. అవన్నీ సిడిలుగా జాగ్రత్తచేసి ఉంచాడు. మరి తరువాత తరంవాళ్ళు తెలుసుకోవాలి కదా. ఆ సిడీలు చూపిస్తారుట. దెబ్బలో ఆ అమ్మాయి అన్నీ నేర్చేసుకొని భాస్కరాన్ని పెళ్ళి చేసుకొని పతివ్రతగా సెటిల్ అవుతుందట."

"బుద్ధిలేకపోతే సరి... సరె, మరి ఆమెకు తెలుగు వచ్చా?"

"ఎవర్నో పట్టుకుంటారులే"

"సర్లే, నేనయితే ఆ పిల్ల బుద్ది చెడగొడతానని భయం. ఆ భయమే నాకు వరం. ఆ దిక్కుమాలిన సీరియల్ చూడటం నాకు శిక్ష అయేది. వాటిలోమనుష్యుల ఆలోచనల్ని భరించలేం. అందుకే మా ఆయన రచనా వ్యాసంగం గురించి ఎవరికి చెప్పను. ఒక్కటి మాత్రం నిజం. ఆవిడ బుద్ధి సరిగ్గా పనిచేసి ఆ సీరియల్ అర్థమైతే, ఇండియన్‌ని పెళ్ళి చేసుకుంటానని మళ్ళీ అనదు." విశాల నవ్వు ఆపుకోలేకపోయింది. గాయత్రి ఏదో అనబోయింది. ఇంతలో చిన్న కూతురి పిలుపు విని లేచి వెళ్ళిపోయింది విశాల.

సాయంత్రం మహాలక్ష్మమ్మ స్వీట్లు తెచ్చి గాయత్రికి, పిల్లలకు ఇచ్చి అందరితో ప్రేమగా మాట్లాడింది. ఆ మాటా ఈ మాటా అయాక కూతురి అమెరికా స్నేహితురాలు వస్తోందని, అప్పుడప్పుడు ఆమెతో కబుర్లు చెప్పటానికి పిల్లల్ని పంపాలనీ మరీ మరీ చెప్పి సరేననిపించుకొని వెళ్ళింది.

అమెరికా పెళ్ళికూతురు ఎక్కువ ఎదురు చూడకుండానే వచ్చింది. విశాలాక్షి ఆదివారం దాకా రాదు. చొరవలేని భాస్కరం ఒక్కడూ ఆమెతో ఎక్కువ సేపు మాట్లాడటానికి మొహమాటపడి పలకరింపులు, పరిచయాలు అయేక తప్పుకున్నాడు. మహాలక్ష్మమ్మ సుందరీ సంజ్ఞలతో ఎక్కువసేపు గడపలేక ఆమెను గాయత్రి ఇంటికి తీసుకు వచ్చారు. పరిచయాలు అయ్యాక అయిష్టంగానే ఆమెనక్కడ వదిలేసి భోజనం ఏర్పాట్లకు ఇంటికి వెళ్ళారు తల్లీ కూతుళ్ళు. వాళ్ళు వెళ్ళటం చూసి విశాల కూతుళ్ళిద్దరూ కూడా వచ్చి చేరారు. భోజనానికి పిలుపు వచ్చేసరికి అందరూ మంచి స్నేహితులైపోయారు.

భోజనాలు అవుతూనే ఆంధ్ర సంస్కృతి పరిచయం మొదలైంది. మహాలక్ష్మమ్మ స్వయంగా వచ్చి విజయనీ, చిట్టినీ తీసుకెళ్ళింది. అక్కడ నుండి రాత్రి దాకా ఎవర్నీ తలతిప్పి చూడనివ్వలేదు, నోరు విప్పి మాట్లాడనివ్వలేదు.

తలుపు బాదుతున్న చప్పుడు విని లేచి వెళ్ళి తలుపు తీసింది గాయత్రి. చిట్టిని నడిపించుకుంటూ తీసుకువచ్చి పడుకోబెట్టి తలకు అమృతాంజనం పట్టించుకుంటూ వెళ్ళిపోయింది విజయ.

"అన్నం తినరూ? మీ కోసమే ఎదురు చూస్తున్నా."

"అక్కడ చాలారకాల చెత్త మేశాంలే" విజయ చిరాకు చూసి గాయత్రి నవ్వింది.

"నవ్వుతున్నావు కాని ఆ విషయం రుచి చూస్తే నువ్వు తట్టుకోలేవు. అంత మంచిదీ తెలివైనదీ అయిన అమ్మాయికి ఇంత అసహ్యమైన పరిచయం ఏమిటమ్మా? ఆ సీరియల్సంతా మూడేసి, నాలుగేసి పెళ్ళిళ్ళు, అలా చేసుకున్న వెధవలు భార్యలను అవమానించి తన్ని తరిమెయ్యటం, ఆ పతివ్రతలు ఏడుస్తూ భర్త దయకోసం పాకులాడుతూ కోట్ల మీద వ్యాపారాలు అలవోకగా చెయ్యడం, చిన్న చిన్న పిల్లలు మంచినీళ్ళ ప్రాయంగా మనుష్యుల్ని చంపటం – ఛీ పిశాచాలు కూడా భయపడి పారిపోతాయి ఆ మనుష్యుల్ని చూసి. నేనే జేన్ అయితే తెల్లారేసరికి ఇంటిదారి పట్టేస్తాను.

"అమ్మా చిట్టిని కాస్త చూసుకోవాలి మనం. వాళ్ళ రేఖయితే తన వయసు పిల్లలు విషంపెట్టిస్తుంటే ఆరాధనగా చూస్తోంది. విశాలత్తకి చెప్పు లేకపోతే తనకు నచ్చని పనిచేసిన వాళ్ళని పైకి పంపెయ్యగలదు అది.

"నువ్వు మరీలేద్దూ"

"నేను, సుజాతా జేన్‌తో చెప్పాంలే, మనుష్యుల్ని గురించి తెలుసుకోవటానికి ఈ చెత్త చూడవద్దని, కొన్ని కుటుంబాలతో కలసి గడిపి పండుగలు, పేరంటాలు వంటివి చూడమని."

ఉన్నట్లుండి పకపకా నవ్వింది విజయ. గాయత్రి కంగారు పడింది.విజయ నవ్వాపుకుంది. "భయపడకమ్మా. ప్రొద్దుటి నుండి మహాలక్ష్మమ్మ జేన్ మీద ప్రాణాలన్ని పెట్టుకుని సుజాతనీ, రేఖనీ పురుగుల్లా చూస్తోంది. రేఖ సీరియల్స్ శ్రద్ధగా చూస్తోంది కదా, విషం పెట్టే ప్రోగ్రామ్స్ అన్నీ బాగా అర్థం చేసుకొంటుందీ. ఎవర్నయినా పైకి పంపేయవచ్చు."

"సర్లే నీ పని చూసుకొని త్వరగా పడుకో"

గాయత్రికి నిద్ర పట్టలేదు. ముందు విశాలని రప్పించాలని నిర్ణయించుకున్నాక మనసు కుదుటపడింది.

పొద్దున్నే జేన్ వచ్చింది. విజయ ఆమెను చూస్తూనే దండం పెట్టేసింది.

జేన్ నవ్వింది. "డోంట్ వరీ. తరువాత నేనే వస్తా" గాయత్రిని పలకరించి, జేన్ వెళ్ళిపోయింది.

"పదయింది. ఆఫీస్‌కు సెలవు పెట్టావా అమ్మా?"

"లేదమ్మా, రెండింటికి వెడతాను. రిపోర్టు రెడి చెయ్యటానికి టైము తీసుకున్నాను. అదీ అయిపోవచ్చింది."

"విజై" జేన్ లోపలికి వచ్చింది.

"నేనింక చూడలేను, నన్ను వదిలెయ్యి జేన్"

"నేను మీతో, సుజాతతో మాట్లాడాలి"

"సుజాత కాలేజికి వెళ్ళిపోయినట్లుంది." సుజాత పుస్తకాలు పట్టుకొని లోపలకు వచ్చింది. "ఇదే ఈవేళ్టికి కాలేజి"

ముగ్గురూ గదిలోకి దారితీశారు. జేన్ వెనక్కు తిరిగి గాయత్రిని పిలిచింది, "మీరు కూడా రండి" జేన్ తిన్నగా విషయానికి వచ్చింది.

"నిన్న మనం చూసిందంతా ట్రాష్ అని, ఫూలిష్ పర్‌వెర్షన్ అని అనుకుంటున్నాను."

"అమ్మయ్య, నిన్నటి నుండి నాకెంతో బాధగా ఉంది. దీన్నెక్కడ నమ్ముతావో అని"

సుజాత తండ్రి అసమాన సృష్టి తలచుకొని తల వంచుకుంది. జేన్ స్నేహంగా ఆమె భుజం తట్టి నవ్వింది.

"నువ్వెలాగా నెల రోజులుండాలనుకున్నావు కదా. మా తాతగారి ఊరెళ్ళి ఒకరోజుందాం. మా ఫ్రెండ్స్ కొందరి కుటుంబాలతో గడుపు. పదిరోజులు గడిపేక అప్పుడు ఆలోచిద్దాం."

అందరూ మాటల్లో పడ్డారు. ఇంతలో రేఖ వచ్చి జేన్‌ని పిలుచుకు వెళ్ళింది. జేన్‌ను తమ నుండి ఎవరూ దూరం చెయ్యకుండా మహాలక్ష్మమ్మ చేసే ప్రయత్నాలు చూసి అందరూ నవ్వుకున్నారు.

గాయత్రి స్నానం చేసి తయారవుతోంది. విజయ ఆదుర్దాగా లోపలికి వచ్చింది. చిట్టి భయం భయంగా వెనకే వచ్చింది.

"అమ్మకు చెప్పు చిట్టీ"

"ఏమిటే, ఏం కావాలి?"

"మరీ, పొద్దున్నే జేన్‌ని మనింటికి తీసుకువచ్చిందని మహాలక్ష్మమ్మ సుజాతక్క కాలేజికి వెళ్ళాక రేఖను కొట్టింది. టిఫిన్, పాలు ఇవ్వలేదు. అన్నం కూడ పెట్టలేదు. దానికి ఆకలేస్తే అరటిపండు, బిస్కెట్లు మనింట్లోవి పెట్టాను."

"చెప్పు" విజయ బుజ్జగించింది.

"మరి, దానికి మామ్మ వేసుకునే నిద్ర మాత్రలు కావాలిట"

"ఎందుకూ?"

"నిన్న సీరియల్‌లో దానంత పిల్ల ఇలాంటిదానినే వాడిందిలే అమ్మా, అవి జేన్‌కోసంట"

గాయత్రి వొణికిపోయింది. వెంటనే రేఖను పిలిపించి నచ్చచెప్పి దాని మనస్సు మళ్ళించింది. జాగ్రత్త కోసం ఆ పిల్లని తనింట్లోనే ఉంచుకుంది.

"గాయత్రీ" విశాల లోపలికి వచ్చింది. "ఏమిటి అంత అర్జెంటుగా రమ్మన్నారు? జేన్‌కి నాతో పని అంటారేమిటి?"

"రండి, మీ అత్తగారి ప్రేమ నుంచి ఆమెను కాపాడాలి. రండి అన్నంతిందాం"

అన్నం తిని లేచాక గాయత్రి అతి జాగ్రత్తగా జరిగింది చెప్పింది. విశాలకు తల మీద పిడుగు పడ్డట్లయింది. బొమ్మలా కూర్చుండి బోయింది. విశాల భుజం మీద చెయ్యివేసి ఏదో చెప్పబోయింది గాయత్రి. బయట పెద్దగా మహాలక్ష్మమ్మ కేకలు, తిట్లు వినిపించాయి. కొంత విన్నాక అర్థం అయ్యింది జేన్ వెళ్ళిపోయిందని. విశాల ఆలోచన పూర్తిచేసి ఒక నిర్ణయానికి వచ్చి పెద్ద కూతురి చెయ్యి పట్టుకుని లేచింది. ఇద్దరూ వెళ్ళి తమ వస్తువులు సర్దుకొన్నారు. సామాను బయటపెట్టి ఆటో పిలవమని కూతుళ్ళకు చెప్పి హాల్లోకి వచ్చింది. జరుగుతున్నదేవిటో అర్థంకాక నోరు తెరచుకొని చూస్తునానరు అందరూ. విశాలాక్షి భర్త ఎదుటికి వచ్చి, నెమ్మదిగా, నిదానంగా మొదలుపెట్టింది.

"మిమ్మల్నెవర్నీ మీ పనులు మానమనో, పద్ధతులు మార్చుకోమనో చెప్పాలని నేననుకోవటంలేదు. నేనేనా పిల్లల్ని తీసుకుని వెళ్ళిపోతున్నాను..."

"మీరేం చెప్పొద్దు. నేను వినను. మీరు స్థిరం లేకుండా తిరిగినా డబ్బంతా తగలేసినా ఊరుకున్నాను. నన్ను ఎలా చూసినా, ఎంత ఏడ్పించినా, మాడ్చినా సహించాను. పిల్లల్ని ఆదరించకపోయినా మాట్లాడలేదు. నిశ్శబ్దంగా చాకిరీ చేసాను. పిల్లల్ని బాగా పెంచుకుంటున్నానన్న నమ్మకంతో అన్నీ భరించాను. ఈ వేళ మీ సీరియల్ చూసి రేఖ జెన్‌ను నిద్రమాత్రలు ఇచ్చి చంపబోయింది. చూసుకొని ఆపుకున్నాను. మరోసారి ఆపకక పోవచ్చు. ఇంకా దారుణమైన ఆలోచనలు రావచ్చు. ఈ విషం బాగా ఎక్కాక. మీ రచనలన్నీ వినోదం పేరుతో పిశాచాల్ని తయారు చేసేవి కదా. మీరది మానలేరు. నా పిల్లల్ని నేను కాపాడుకోవాలి, నేనే వెడతాను."

ఆలస్యం చేస్తే దాన్ని తిట్టినందుకో, కొట్టినందుకో మీరు చూపించిన పద్ధతిలోనే మిమ్మల్నేదో చేసే ప్రయత్నం చేయవచ్చు. మీ కళకు అది సార్థకతే కాని నా పిల్లలు అలా అవుతుంటే నేను ఊరుకోలేను. వాళ్ళని మంచి మనుష్యులుగా పెంచుకోటానికి తీసుకెడుతున్నాను. అడ్డుకొనే ప్రయత్నం చేసి మర్యాద పోగొట్టుకోకండి. ఎప్పటికైనా మీలాంటి రచయితలు ఆదాయంతో పాటు తమ ప్రేక్షకుల్ని అందులోను పసి ప్రేక్షకుల గురించి కూడా ఆలోచిస్తే నాలాంటి తల్లులు తమ కుటుంబాలకు దూరం కానక్కరలేదు.

పిల్లల్ని చెరో చేత్తో దగ్గిరకు తీసుకుని బయటకు వచ్చింది విశాలాక్షి.

■

# స్ఫూర్తి

-సోమంచి ఉషారాణి

అదొక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కాకపోయినా అటువంటి ఆసుపత్రికి ఉండవలసిన హంగులన్నీ ఉన్నాయి.

ఆర్థికంగా మధ్య తరగతి స్థాయివారికి ఎక్కువగానూ, ధనవంతులకి కొంచెం తక్కువగానూ ఉండే ప్రైవేటు ఆసుపత్రి!

అన్నిరకాల వ్యాధులకీ చికిత్స చేస్తున్నప్పటికీ ఎక్కువగా హృదయానికి సంబంధించిన అంటే హార్ట్ ప్రాబ్లమ్స్ వాళ్ళే ఎక్కువ.

అక్కడి డాక్టర్లూ, వారి ట్రీట్‌మెంటూ, మేధా సంపత్తీ చూస్తుంటే నిజంగా దేవుళ్ళేనని చేతులెత్తి మొక్కాలని పిస్తుంది.

రోగుల పరిస్థితిని బట్టి నర్సులకి చకా చకా ఆర్డర్లిస్తూ, స్వంత ఆత్మీయుల్లా పది నిమిషాలకో మారు 'ఎలా ఉంద'ని పరామర్శిస్తూ, వారి బాధను తగ్గించడానికి శాయశక్తులా కృషిచేస్తుంటారు.

ఇక ఆ నర్సులను చూస్తుంటే దేవదూతల్లా కనిపిస్తారు. తమ కష్టాలనూ, కన్నీళ్ళనూ తమలోనే దాచుకుని వైద్యసేవే పరమావధిగా, రోగులే తమ పాలిటి కల్పతరువుల్లాగా భావిస్తూ – స్వంత మనుష్యులుగా రోగులకు ధైర్యం చెబుతూ, మందులు, ఇంజక్షన్లూ చేస్తూ, కర స్పర్శతో కొండంత అండగా నిలుస్తారు.

ఈ మధ్య చిన్న హార్ట్ ప్రాబ్లమ్ వచ్చి ఆ ఆసుపత్రిలో చేరాను. ఒకరోజు ఐసియులో కూడా పెట్టారు.

అక్కడి నర్సులనూ, వారి కార్యదీక్షనూ చూస్తుంటే నేను గుండెనొప్పి మర్చిపోయాను. వారి గురించి తెలుసుకోవాలని కుతూహలం కలిగింది సహజంగానే నాలో రచయిత్రికి.

కేరళ, తమిళనాడు లాంటి ఇతర రాష్ట్రాల నుండే కాక నేపాల్, టిబెట్ నుండి వచ్చిన వాళ్ళు కూడా ఉన్నారు.

హాస్టల్‌లో ఉంటూ, పన్నెండు గంటలు నిర్విరామంగా పనిచేస్తూ, వాళ్ళు సంపాదించేది తక్కువే!

ఐసియులో ప్రతి రోగికీ ఒక సిస్టర్! వాళ్ళు డ్యూటీ చేస్తున్నంతసేపూ నిలబడి ఉండాల్సిందే! అసలు కుర్చీలే ఉండవు.

గంట గంటకీ రోగి కండిషన్ నోట్ చేయాల్సిందే! అవసరమైతే బీపీ, టెంపరేచర్ చెక్ చేస్తుంటారు.

రక్తం ఎక్కించేవాళ్ళకు రక్తం ఎక్కిస్తూ, ఆక్సిజన్ పెట్టేవాళ్ళను అనుక్షణం కనిపెడుతూ, మందులు వేస్తూ, ఇంజక్షన్ చేస్తూ, నైట్ డ్యూటీ అయినా రెప్పవేయక సేవచేసే వారిని ఎంత అభినందిస్తే వారి ఋణం తీర్చుకోగలుగుతాం?

'డబ్బు తీసుకోవటం లేదా? ఎవరి కోసం చేస్తారు?' అనుకోవచ్చు చాలామంది. 'వాళ్ళ డ్యూటీయే అది! అందులో గొప్పేముంది?' అని విమర్శించవచ్చు కొంతమంది.

డబ్బు తీసుకునే వాళ్ళందరూ తమ కర్తవ్యాన్ని సిన్సియర్‌గా నిర్వహిస్తున్నారా? అంతెందుకు? కన్న బిడ్డలకి ఆస్తి కావాలి కానీ తమ బాధ్యతను ఎంతవరకు గుర్తిస్తున్నారు?

తరువాత వచ్చిన నర్సుకి ఆ కేసు సమ్మరీ అంతా వివరించి, ఓపిగ్గా వారి సందేహాలు తీర్చి వెళ్ళిపోతారు.

ఎవరెలాంటి వారైనా చాలా ఓపిగ్గా సమాధానాలు చెబుతారు. వాళ్ళు సమయం దొరికితే చదివేది మెడికల్ జర్నల్స్ తప్ప వీక్లీలూ, నవలలూ వాళ్ళకి అక్కరలేదు. టీవీలకి తీరికేది?

ఇకపోతే ఆయాలూ, వార్డు బోయ్‌ల సేవ మాటలకందనిది. అన్నిరకాల రోగుల మలమూత్రాలు ఎత్తిపోస్తూ, ఆస్పత్రిని చాలా పరిశుభ్రంగా ఉంచే వారి సంపాదనా అంతంత మాత్రమే. అయినా విసుక్కోకుండా, కసురుకోకుండా డాక్టరు, నర్సులు చెప్పిన పనిని చకచకా చేసేస్తుంటారు.

అయినవాళ్ళే చేయడానికి అసహ్యించుకునే పనులను ఎంత డబ్బుకోసమే అయినా అతి మామూలుగా, అవసరమైతే కంగారుపడుతూ, ఓపిగ్గా, వృత్తే దైవంగా చేసేస్తుంటారు.

'ఇదంతా మాకెందుకు? మేము మా పని చేయటం లేదా? ఎవరి పని వాళ్ళు చేయడంలో విశేషం ఏముంది?' అని చాలామందికి సందేహం రావచ్చు. నిజమే! ఎవరి పని వారు బాధ్యతాయుతంగా చేసేవారి కోసం కాదు. కర్తవ్యాన్ని మరచి సోమరిపోతుల్లా, వీధి రౌడీల్లా రోడ్లమీద తిరిగేవారికి! ఇరవై నాలుగ్గంటలూ టీవీలు, సినిమాలు చూస్తూ, పిచ్చిపాటలూ, వెకిలి డాన్సులూ చేస్తూ అవే మా హాబీలంటూ నిర్భయంగా చెప్పేవారికి!

వానైనా, చలైనా క్రమం తప్పక ప్రతిరోజూ వచ్చే పేపరువాడు, పాలవాడు, పనిమనిషీ ఒక్కరోజు ఆలస్యమైతే ఎందు కాలస్యమైందని నిలదీస్తాం! వాళ్ళూ మనుష్యులేనని ఒక్కక్షణం ఆలోచిస్తే? మనం డ్యూటీకి ఆలస్యంగా వెళ్ళినా, అసలు వెళ్ళకపోయినా ఎవరూ ప్రశ్నించకూడదు. అలా ప్రశ్నిస్తే వాళ్ళని తిట్టుకుంటాము.

కొంతమంది కొంచెం అనారోగ్యం వచ్చేసరికి మంచం ఎక్కేస్తారు. మరికొంత మంది ఓపిక లేదనో, మనసు బాలేదనో ఏవో సాకులు చెప్పి పనులు చేయడానికి బద్ధకిస్తారు. మనం చాలా సమయాన్ని వృధా చేస్తుంటాము షాపింగనో, ప్రక్కవాళ్ళతో పనికిరాని ముచ్చట్లతో, ఒకరిమీద మరొకరికి చాడీలు చెబుతూ సంతృప్తి పడుతుంటాము. ఎవరి గురించైనా మనకి చెబుతున్నారంటే అటువంటి వారు మన గురించి కూడా అవతలవాళ్ళకి చేరవేస్తారని మర్చిపోకూడదు. అటువంటి వారిని దూరంగా ఉంచి, ఆచితూచి మాట్లాడాలి. "కాలుజారితే తీసుకోవచ్చు కానీ నోరుజారితే..." తెలుసుగా!

కొత్త కొత్త మందులూ, పరికరాలూ, వస్తువులూ, ఎన్నో విషయాలూ కనిపెట్టే వారినీ, కర్తవ్య దీక్షలో ఎవరికీ తీసిపోని డాక్టర్లనూ, నర్సులనూ, ఆయాలనూ, ఇంజనీర్లనూ, లెక్చరర్లనూ ఎందరో మహానుభావులు వారందరినీ స్ఫూర్తిగా తీసుకుంటూ మనం అంతటి వాళ్ళం కాకపోయినా మన పనిని మనం ఎంతవరకు సక్రమంగా నిర్వహిస్తున్నాం, మన పిల్లల్ని ఎంతవరకూ కర్తవ్యోన్ముఖులను చేస్తున్నామని ప్రతి ఒక్కరూ ప్రశ్నించుకుంటే మాననీయులే!

■